మానేరు జనత®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
17.3.2026 మంగళవారం Tuesday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 327 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్
## మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# ప్రతి పౌరుడికి అభివృద్ధిలో భాగస్వామ్యం

## ఆమేరకు తెలంగాణ బడ్జెట్ రూపకల్పన

- 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు
- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం అందిస్తోంది
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్ర అభివృద్ధి
- గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5 లక్షల 72 వేల కోట్ల పెట్టుబడులు
- హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూముల బదలాయింపు
- రాష్ట్రంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- మూసీనది ప్రక్షాళనకు పథకాల రచన చేపట్టాం
- ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరిక
- తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజు గవర్నర్ ప్రసంగం
- తొలుత తెలుగులో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్ శుక్లా



**జనతా న్యూస్, హైదరాబాద్ :** ప్రతిపౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. 2047 తెలంగాణ రైజింగ్ దిశగా అడుగులు వేస్తున్నట్లు గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభమ య్యాయి. అసెంబ్లీలో తొలిసారి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఆపై గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయసభలను ఉ ద్దేశించి తెలుగులో ప్రసంగించారు. తొలుత గవర్నర్ తన ప్రసంగాన్ని తెలుగులో ప్రారంభించడం విశేషం. 2047 నాటికి 3 ట్రిలియన్

మిగతా 2 లో

# సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

- అన్ని సమస్యలపై అవగాహనతో సిద్ధం కావాలి
- ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలతో సిద్దంగా ఉండాలి
- సిఎల్పీ సమావేశానికి కొందురు డుమ్మాపై సీరియస్
- గవర్నర్ ప్రసంగం మనకు రోడ్ మ్యాప్ లాంటిది
- కెసిఆర్ హయాంలో విపక్షానికి మాట్లాడే సమయం ఇవ్వలేదు
- సిఎల్పి సమావేశంలో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు



**జనతా న్యూస్, హైదరాబాద్ :** శాసనసభ సమావేశాలకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని పార్టీ ఎమ్మెల్యేలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వివిధ అంశాలపై ఎమ్మెల్యేలు అవగాహన పెంచుకోవాలని, వారికి మంత్రులు సమయమివ్వాలని సూచించారు. తెలంగాణ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో సీఎల్పీ సమావేశమైంది. ఈ సందర్భంగా పలు అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై

మిగతా 2 లో

# అర్హులకే ఇళ్లు... అక్రమార్కులకు చెక్



- క్యూర్ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు
- నివాసంలో లేని డబుల్ ఇళ్ల లబ్దిదారులకు నోటీసులు
- ఏప్రిల్ 30వరకు గడువు
- అనర్హుల స్థానంలో అర్హులకు కేటాయిస్తాం
- క్యూర్ పరిధిలో హౌసింగ్ పై మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నంతో మంత్రి పొంగులేటి సమీక్ష


వివరాలు 2 లో

హైదరాబాద్,రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు.



# మార్చి 31 వరకు తెలంగాణ అసెంబ్లీ

- 20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి
- ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు
- బిఎసి సమావేశంలో నిర్ణయం



# రాహుల్‌కు వెయ్యి కోట్లు.. రైతులకు వెన్నుపోటు

- రాహుల్ బంధు కాదు.. రైతు బంధు కావాలి
- ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలి
- గన్‌పార్క్ దగ్గర నిరసన దీక్షలో కేటీఆర్
- ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో నిలదీస్తాం
- నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు.

వివరాలు 3 లో

## సీఎం రేవంత్ అసమర్థత

నీటి వాటాలను కోల్పోతున్నాం: హరీష్ రావు



# కవి నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

- కరోనా కష్టాలపై రాసిన అనిమేషకు గాను అవార్డు ప్రకటన
- సిధారెడ్డికి అవార్డుపై సాహితీవేత్తలు, కేసీఆర్, కేటీఆర్ హర్షం


తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 లభించింది. ఆయన కవితా సంపుటి 'అనిమేష' లో కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాలను, మానవ సంబంధాల విచ్ఛిన్నతలను హృద్యంగా చిత్రీకరించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా, మంజీరా రచయితల సంఘం ద్వారా తెలుగు సాహిత్యానికి కొత్త ఊపునిచ్చి, తెలంగాణ ఉ ద్యమానికి తన కవిత్వం ద్వారా గొప్ప సహకారానిచ్చిన ఆయన తెలంగాణ సాహిత్యానికి గర్వకారణం.

**జనతా న్యూస్, హైదరాబాద్ :** నందిని సిధారెడ్డి తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్‌గా పనిచేశారు. తన కలం ద్వారా తెలంగాణ సంస్కృతి, ఆత్మ, జీవన విధానాలను ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా తెలంగాణ సాహిత్యానికి అగ్రగామిగా నిలిచారు. ఆయన రచనలు కేవలం కవిత్వం మాత్రమే కాక, తెలంగాణ జీవితం, ప్రజల సమస్యలు, ఉద్యమం వంటి అంశాలను స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. మెదక్ జిల్లా కేంద్రంగా 'మంజీరా రచయితల

మిగతా 2 లో

# హైదరాబాద్ నార్సింగ్‌లో దారుణం

## ఆరేళ బాలికపై కామాంధుడి అత్యాచారం.. హత్య




02

హైదరాబాద్ నగరంలోని నార్సింగిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కామాంధుడు.. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. చాక్లెట్ ఇప్పిస్తానంటూ బాలికను నమ్మించి అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు.

# కవి నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

మొదటి పేజీ తరువాయి



సంఘం' స్థాపించి, ఎందరో వర్ధమాన కవులను, రచయితలను ప్రోత్సహించారు. సాహిత్యానికి ప్రాంతీయతను అద్దడంలో ఆయనది ప్రత్యేక శైలి. ఈ సంఘం ద్వారా తెలుగు సాహిత్యంలో నూతనవాణి, విభిన్న అభివ్యక్తులు, సామాజిక చైతన్యానికి వేదికైంది. ఈ సంఘం తెలుగు సాహిత్యానికి కొత్త వన్నె తెచ్చి, యువ రచయితలకు ప్రేరణనిస్తూ, తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన సృజనాత్మక రచనల ద్వారా చాటుతూ తెలంగాణ ఉద్యమానికి గొప్ప ఊపునిచ్చింది. ఈ అవార్డు తెచ్చిపెట్టిన 'అనిమేష' కవితా సంపుటి కేవలం అక్షరాల కూర్పు కాదు అది ఒక కాలానికి దర్పణం. ప్రపంచాన్ని వణికించిన కరోనా కాలంలోని సామాజిక పరిస్థితులు, మానవ సంబంధాలు, వలస కూలీల కష్టాలు, ఒంటరితనాన్ని ఈ సంపుటిలో కళ్లకు కట్టారు. 'అనిమేష'లో కరోనా సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సామాజిక, ఆర్థిక, మానవ సంబంధ సమస్యలను నందిని సిధారెడ్డి హృద్యంగా చిత్రీకరించారు. మానవ సంబంధాల విచ్ఛిన్నత, సమాజంలో ఒంటరితనం, ఆందోళన, సామాజిక కలతలను ప్రతిబింబింపజేసే నందిని సిధారెడ్డి కవిత్వం పాఠకులకు ప్రేరణగా నిలుస్తోంది. 'నాగేటి సాల్లళ్ల నా తెలంగాణ' వంటి పాటల ద్వారా తెలంగాణ పల్లె జీవనాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాటలు ప్రజలను ఉర్రూతలూగించడమే కాకుండా, స్వరాష్ట్ర ఆకాంక్షను బలోపేతం చేశాయి. తెలంగాణ స్వతంత్ర రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమంలో నందిని సిధారెడ్డి పాటలు, కవిత్వం ద్వారా ప్రజలను ఆలోచింపజేశారు. ఆయన రచనలు రాష్ట్ర ఉద్యమానికి ఉత్సాహాన్ని నింపాయి. ప్రజల సమస్యలను కవిత్వం ద్వారా తెలియజేయడం, ఉద్యమ కవిగా ప్రజల అభిమానాన్ని పొందడం ఈ విధంగా తెలంగాణ ఉద్యమంలో నందిని సిధారెడ్డి కీలక పాత్ర పోషించారు. నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందడం తెలంగాణ సాహిత్యానికి, సమాజానికి, సాంస్కృతికంగా గర్వకారణమని సాహితీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఆయన కృషి, తెలుగు సాహిత్యానికి చేసిన విశిష్టమైన సేవలు గుర్తింపుగా నిలిచాయి. తెలంగాణ ఆత్మ, జీవితం, సంస్కృతిని ప్రపంచానికి చాటిన రచయితగా నందిని సిధారెడ్డి ప్రత్యేక స్థానాన్ని సంపాదించారని సాహితీ లోకం తెలిపింది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత, భాషా సాహిత్యాల వికాసం కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ సాహిత్య అకాడమికి తొలి చైర్మన్‌గా నందిని సిధారెడ్డి సేవలు అందించారు. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు అనేక పుస్తకాలను ఆయన వెలుగులోకి తెచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా అందించే, అత్యున్నత 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు -2025 ' ఈసారి ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, నందిని సిద్దారెడ్డి కి దక్కడం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిని సిద్దారెడ్డిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కరోనా సందర్భంగా ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతలను కవిత్వం ద్వారా హృద్యంగా చిత్రీకరించిన, దీర్ఘ కవితా సంపుటి ' అనిమేష'కు ఈ అవార్డు రావడం గొప్ప విషయమని అన్నారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవిగా, తన సాహిత్యం ద్వారా తెలంగాణ జీవితాన్ని అక్షరబద్ధం చేసిన తెలంగాణ గర్వించదగ్గ కవి, నందిని సిధారెడ్డి అని కొనియాడారు. మెదక్ జిల్లా కేంద్రంగా మంజీరా రచయితల సంఘం ఏర్పాటుచేసి, అన్ని వర్గాల ప్రజా సమస్యలు, సామాజిక సమానత్వం కోసం రచనలు చేస్తూ తమ కలాన్ని, గళాన్ని విప్పారని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తన పాట, సాహిత్యం ద్వారా ప్రజలను ఆలోచింపజేస్తూ, ఉద్యమ కవిగా తెలంగాణ ప్రజల అభిమానాన్ని సిధారెడ్డి చూరగొన్నారని పేర్కొన్నారు. ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ సాహిత్య అకాడమి తొలి చైర్మన్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు దక్కడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అత్యున్నత పురస్కారం లభించడం యావత్ తెలంగాణకే గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా సిధారెడ్డికి తన తరపున , పార్టీ తరపున మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. నందిని సిధారెడ్డి ఆధునిక తెలుగు కవిత్వంలో ఎన్నో పరిశోధనలు చేసి, తన అమూల్యమైన రచనలతో తెలుగు సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. మంజీరా రచయితల సంఘం స్థాపించి తెలుగు సాహిత్యానికే వన్నె తెచ్చిన ఆయన కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన శక్తివంతమైన పాటలతో చాటుతూ, తెలంగాణ ఉద్యమానికి ఒక గొప్ప ఊపునిచ్చిన ప్రజా కవిగా ఆయనను అభివర్ణించారు. సాహిత్య రంగంలో అత్యున్నత పురస్కారమైన కేంద్ర సాహిత్య అకాడమి అవార్డును సిధారెడ్డి గెలుచుకోవడం వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని తన కలం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన ఆయనకు ఈ పురస్కారం దక్కడం సముచితమని అన్నారు.

# హైదరాబాద్ నార్సింగ్‌లో దారుణం

## ఆరేళ బాలికపై కామాంధుడి అత్యాచారం.. హత్య

**హైదరాబాద్,మార్చి16 :** హైదరాబాద్ నగరంలోని నార్సింగిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కామాంధుడు.. ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేశాడు. చాక్లెట్ ఇప్పిస్తానంటూ బాలికను నమ్మించి అత్యాచారం చేసి ప్రాణాలు తీశాడు. చిన్నారి ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో రాత్రి 10 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌లో బాలికను కామాంధుడు తీసుకెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో గుండెల్ని పిండేసే ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. మానవత్వం అనే విషయాన్ని మంట కలుపుతూ కేవలం ఆరేళ్ల వయసున్న ఓ చిన్నారిపై అత్యాచారం చేసి, ఆపై గొంతు నులిమి హత్య చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు నార్సింగిలో నివసించే ఆరేళ్ల బాలిక ఆదివారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటూ ఉంది. అయితే ఉనట్లుంది కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నారి అదృశ్యంపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రంగంలోకి దిగిన పోలీసులు బాధితురాలి ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఒక వ్యక్తి బాలికకు చాక్లెట్ ఇప్పిస్తానని నమ్మించి, తన వెంట తీసుకువెళ్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ ఆధారాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి, కొద్దిసేపటికే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు తన దారుణానికి పాల్పడినట్లు అంగీకరించాడు. బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆపై ఎక్కడ దొరికిపోతానో అన్న భయంతో ఆమెను దారుణంగా హత్య చేసినట్లు తెలిపాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో నిందితుడు చూపిన ప్రాంతంలో పోలీసులు బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఉన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా వేగంగా విచారణ చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే బాలిక మృతితో కుటుంబం కన్నీరుమున్నీరయ్యింది.

# పాతబస్తీలో అగ్నిప్రమాదం

**హైదరాబాద్,మార్చి16 :** హైదరాబాద్ ఫలక్‌నుమా పరిధిలోని ఫరూక్‌నగర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానిక బస్‌డిపో పక్కన ఉన్న దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. క్రమంగా అవి పక్కనున్న ఫర్నిచర్ షాపు, ఇతర దుకాణాలకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిపమాక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకొని మంటలు ఆర్పుతున్నారు. పక్కనే ఇండేన్ గ్యాస్ గోదాం ఉండటంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రతి పౌరుడికి అభివృద్ధిలో భాగస్వామ్యం

మొదటి పేజీ తరువాయి

డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని గవర్నర్ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ జీడీపీకి తెలంగాణ 4.99 శాతం అందిస్తోందని తెలిపారు. ప్రపంచానికే దిక్సూచిగా తెలంగాణ నిలుస్తోందని అన్నారు. ఏడాది కాలంలో సంక్షేమ ఫలితాలు అందరికీ అందేలా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని గవర్నర్ తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని కోర్, ప్యూర్, రేర్‌గా విభజించామని, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించామని గవర్నర్ తెలిపారు. హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూముల బదలాయింపు చేపట్టామని గవర్నర్ తెలిపారు. ప్రజలకు రక్షణ, భద్రత కల్పించేందుకు నాలుగు కమిషనరేట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మూసీనది ప్రక్షాళనకు ప్రణాళికలు రచిస్తున్నామని, తొలి దశలో హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి చేపడతామని ఆయన చెప్పారు. మూసీలో మురుగు నీరు చేరకుండా 39 ఆర్ఓబిలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఓఆర్ఆర్ మాదిరిగా రీజినల్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయబోతున్నామని గవర్నర్ తెలిపారు. పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించాలని నిర్ణయించామని గవర్నర్ తెలిపారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ ఎమ్ఎస్ఎమ్ఈ పార్కులు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5 లక్షల 72 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌కు అనుబంధంగా రేడియల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం చేపడతామని వివరించారు. బుల్లెట్ రైళ్లకు శంషాబాద్ కేంద్రంగా మారబోతోందన్నారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కొత్త ఎయిర్‌పోర్టులు రాబోతున్నా యని గవర్నర్ వెల్లడించారు. ఇల్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని గవర్నర్ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 4లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. రైతు భరోసా కింద 9 రోజుల్లో రూ.9వేల కోట్లు అందించామని చెప్పారు. ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కొడంగల్ ప్రాంతం పారిశ్రామికవాడగా మారబోతోందని గవర్నర్ వెల్లడించారు. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరాయన్నారు. వ్యవసాయరంగ అభివృద్ధికి రేర్ నమూనా రూపొందించామని తెలిపారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అమలుకు 99 రోజుల కార్యాచరణ రూపొందించి నట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 64,697 పిటిషన్లలో 47,670 పరిష్కరించామని గవర్నర్ శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందనిశుక్లా అన్నారు. ప్రతి వర్గానికీ అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. శ్రమించేతత్వం గల తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు. ప్రజా కేంద్రీకృత పాలన ప్రభుత్వ విధానం. విజన్-2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్డు మ్యాప్ రూపొందించాం. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18లక్షలకు చేరింది. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్ అనుసరిస్తున్నాం. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుతుందని అంచనా. జీహెచ్ఎంసీని ఇటీవలే 3 కార్పొరేషన్లుగా.. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించాం. హైడ్రా ద్వారా రూ.60వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం. 23వ బయో ఆసియా సదస్సు ద్వారా రూ.1700 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. జీసీసీలలో 20 శాతం ఆతిథ్యం ఇస్తూ హైదరాబాద్ గ్లోబల్ టెక్ హబ్‌గా మారింది. ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా తెలంగాణ కొనసాగుతోంది. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఈ రంగం 9.39లక్షల ఉద్యోగాలు కల్పిస్తోందని అన్నారు. గతేడాది వానాకాలంలో రైతుభరోసా కింద రూ.8,744 కోట్లు ఇచ్చాం. పంట రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేశాం. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. కొత్తగా 15.12లక్షల రేషన్ కార్డులు ఇచ్చాం. 3.38 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయి. ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టాం. ఈగల్ ప్రత్యేక బృందం ద్వారా డ్రగ్స్‌సమస్యను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం. టీజీపీఎస్సీ, ఇతర నియామక బోర్డులను సంస్కరించాం. రికార్డు సమయంలో 67,763 ఉద్యోగాలను భర్తీ చేశాం. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాం' అని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. తొలుత గవర్నర్ అసెంబ్లీకి చేరుకోగానే సిఎం రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌లు స్వాగతం పలికారు. అయితే శాసనసభలో బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభలో నిలబడి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన వ్యక్తం చేశారు . బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన మధ్యే గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు.



# శాసనసభ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం

## లాంఛనంగా ప్రారంభించిన గవర్నర్ శుక్లా.. పుష్పాంజలి ఘటించిన గవర్నర్, సిఎం, మంత్రులు

**హైదరాబాద్,మార్చి16 :** శాసనసభ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పునరుద్ధరించిన మండలి భవనం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాష్ట్ర శాసనసభ ఆవరణలో రాష్ట్ర ఆత్మగౌరవ చిహ్నంగా నూతనంగా రూపొందించిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వైభవంగా ఆవిష్కరించారు. ఈ చారిత్రక ఘట్టం రాష్ట్ర ప్రముఖులు, మంత్రుల సమక్షంలో అత్యంత వేడుకగా జరిగింది. అనంతరం విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. అసెంబ్లీ ఆవరణలో ఉన్న జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల వద్ద గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఘనంగా నివాళులర్పించారు. దేశానికి, సమాజానికి వారు చేసిన అసమాన సేవలను ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈ విగ్రహం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, ఇది తెలంగాణ ప్రజల పోరాట పటిమకు, సంస్కృతికి, ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక అని ఆయన అభివర్ణించారు. రాష్ట్ర అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దినట్లు ఆయన పేర్కొన్నారు.

# మార్చి 31 వరకు తెలంగాణ అసెంబ్లీ

## 20న సభల బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి

## ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి సెలవులు

**హైదరాబాద్,మార్చి16 :** తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 31 వరకు జరగనున్నాయి. ఈ మేరకు బీఏసీ సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షత బీఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణపై కీలక నిర్ణయం తీసుకున్నారు. మార్చి 16 నుంచి మార్చి 31 వరకు సమావేశాలను నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించారు. సోమవారం ఉదయం గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం అనంతరం స్పీకర్ సభను మంగళవారం వాయిదా వేశారు. అనంతరం స్పీకర్ ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించారు. మార్చి 17, 18న గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ జరగనుంది. ఈనెల 20న అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెను ప్రవేశపెట్టనుంది. ఆపై 23 నుంచి 26 వరకు బడ్జెట్‌పై చర్చలు జరపనున్నారు. మార్చి 31న ద్రవ్య వినిమియ బిల్లుపై చర్చ జరగనుంది. అలాగే ఉగాది, రంజాన్, శ్రీరామనవమికి అసెంబ్లీకి సెలవులు ప్రకటించనున్నారు. బీఏసీ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, విప్ బీర్ల ఐలయ్య హాజరయ్యారు. బీఆర్ఎస్ నుంచి హరీశ్ రావు, కేపీ వివేక్ హాజరవగా.. బీజేపీ నుంచి మహేశ్వర్ రెడ్డి, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు.

# సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కావాల్సిందే

మొదటి పేజీ తరువాయి

సమాధానం ఇచ్చేందుకు పూర్తి సమాచారం దగ్గర ఉంచుకోవాలన్నారు. ఏదో ఒక సాకుతో సభ్యులు సభకు గైర్హాజరు కావొద్దన్నారు. సీఎల్పీకి పలువురు ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని ప్రశ్నించారు. మీడియాతో చిట్‌చాట్‌లు చేయవద్దన్నారు. ప్రజా ప్రభుత్వంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన ప్రసంగంలో వివరించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని అన్నారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై ప్రభుత్వ విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృథా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని దిశానిర్దేశర చేశారు. కేసీఆర్ హయాంలో.. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై మాట్లాడటానికి తమకు సమయం ఇవ్వలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్కకు, జానారెడ్డికి కూడా మైక్



ఇవ్వలేదని ఆగ్రహించారు. సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు తనను సభకు రాకుండా చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిర్లక్ష్యం వహించొద్దని హుకుం జారీ చేశారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని మార్గనిర్దేశర చేశారు. సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఇది మన ప్రభుత్వం.. ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు అజెండా అవుతుందని అన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి పలు సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని.. అది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తోందని అన్నారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు.

# రాహుల్‌కు వెయ్యి కోట్లు
# రైతులకు వెన్నుపోటు..

**రాహుల్ బంధు కాదు.. రైతు బంధు కావాలి**
**ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలి**
**గన్‌పార్క్ దగ్గర నిరసన దీక్షలో కేటీఆర్**
**ఆరు గ్యారెంటీలపై అసెంబ్లీలో నిలదీస్తాం**
**సల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు**




**హైదరాబాద్,మార్చి16 :** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పి కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు ఠంచనుగా పడేదని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పాలనలో పంటలు ఎండిపోతున్నా రైతుబంధు దిక్కులేదని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలకు ముందు అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించామని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. రెండున్నరేళ్లవుతున్నా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. ఆనాడు గవర్నర్‌తో చట్టబద్ధత కల్పిస్తామని చెప్పించారని తెలిపారు. పంటల వేసే నాటికి కేసీఆర్ రైతుబంధు నిధులు వేసేవారని కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ బంధు కాదు.. రైతుబంధు వేయాలని కోరారు. రైతులకు వెన్నుపోటు.. రాహుల్‌కు వెయ్యి కోట్లా అని నిలదీస్తామని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఉద్యోగాల ఊసే లేదని.. రైతుబంధుకు దిక్కే లేదని విమర్శించారు. వృద్ధులు పింఛన్లు, రైతులు, రైతు కూలీలు రైతు భరోసా కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్‌లో ఉత్త క్యాలెండర్ తప్ప జాబ్‌లు కనిపించడం లేదని అన్నారు. ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీలకు రేవంత్ సర్కార్ మంగళం పడిందని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలపై అసెంబ్లీలో నిలదీస్తామని స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ అసమర్థత

## నీటి వాటాలను కోల్పోతున్నాం: హరీష్ రావు

**హైదరాబాద్,మార్చి16:** తెలంగాణకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని ప్రతిసారి ఎత్తిచూపుతున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గోదావరి, కృష్ణా జలాల హక్కుల్లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెదేపా చేతిలో కీలుబొమ్మగా మారిందని ఆక్షేపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీడబ్ల్యూసీ మీటింగ్‌కు వెళ్లటం లేదంటూనే.. ఏపీ డిమాండ్లకు సంతకం చేసి వస్తున్నారని విమర్శించారు.ఇటీవల జరిగిన సీడబ్ల్యూసీ మీటింగ్ అజెండా మొదటి అంశం... పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు. అజెండాలో నల్లమల సాగర్ లేకపోతేనే మీటింగ్‌కు వస్తామని చెప్పి, తర్వాత వెళ్లిపోయి తెలంగాణను మోసం చేశారు. రాష్ట్రాల

మధ్య గోదావరి జలాల పంపిణీయే జరగలేదని సీడబ్ల్యూసీ సమావేశంలో జీఆర్ఎంబీ చెప్పింది. జలాల పంపిణీ జరగలేదని జీఆర్ఎంబీ ఎలా చెబుతుంది? గోదావరిలో నీటి కేటాయింపులు జరగకపోతే.. ప్రాజెక్టులకు అనుమతి ఎలా ఇస్తున్నారని అన్నారు. గోదావరి బేసిన్‌లో వివిధ రాష్ట్రాలు చేపట్టిన 76 ప్రాజెక్టులకు అనుమతి ఎలా ఇచ్చారు? సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత వల్ల తెలంగాణకు అన్యాయం జరుగుతోందని హరీశ్‌రావు విమర్శించారు.

## సమావేశాల నిర్వహణపై హరీష్ అసంతృప్తి

**కేవలం వారం రోజుల్లోనే ముగిస్తే కుదరదు**

తెలంగాణ శాసనసభ బ్జడెట్ సమావేశాల నిర్వహణ తీరుపై బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్ రావు తీవ్రస్థాయి-ంలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్‌లో పనిదినాలు చాలా తక్కువగా ఉన్నాయని, ఇది ప్రజా సమస్యలపై చర్చను నీరుగార్చడమేనని ఆయన ఆరోపించారు. ఈ నెల 30వ తేదీ వరకు సమావేశాలు నిర్వహిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి సభ నడిచేది వారం రోజులు కూడా ఉండదని హరీష్ రావు పేర్కొన్నారు. సమావేశాల మధ్యలో ఉగాది, రంజాన్, శ్రీరామనవమి వంటి పండుగలతో పాటు రెండు ఆదివారాలు వస్తున్నాయని, ఆ ఐదు సెలవు దినాలను మినహాయిస్తే చర్చకు చాలా తక్కువ సమయం మిగులుతుందని ఆయన గణాంకాలతో సహా వివరించారు. సమావేశాల అజెండాపై క్లారిటీ ఇస్తూ, మార్చి 17 , 18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతుందని, ఆ తర్వాత మార్చి 20వ తేదీన ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని ఆయన వెల్లడించారు. అయితే, బ్జడెట్ వంటి కీలక అంశంపై సమగ్రంగా చర్చించే అవకాశం లేకుండా ప్రభుత్వం షెడ్యూల్‌ను కుదించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పండుగ సెలవుల వల్ల తగ్గిన పనిదినాలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం మార్చి 29వ తేదీ ఆదివారం నాడు కూడా సభను నిర్వహించాలని భావిస్తోంది. దీనిపై స్పందించిన హరీష్ రావు, ఆదివారం నాడు సభ పెట్టినా తమకు ఎలాంటి అభ్యంతరం

లేదని స్పష్టం చేశారు. తమకు కావాల్సింది కేవలం చర్చకు తగిన సమయం మాత్రమేనని, ప్రజల పక్షాన గళం వినిపించేందుకు తాము ఎప్పుడూ సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించి బ్జడెట్‌ను ఆమోదింపజేసుకోవాలని చూస్తోందని, దీనివల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ఆయన విమర్శించారు.

# అర్హులకే ఇళ్లు.. అక్రమార్కులకు చెక్

**క్యూర్ పరిధిలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్లు**
**నివాసంలో లేని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులకు నోటీసులు**
**ఏప్రిల్ 30వరకు గడువు**
**అనర్హుల స్థానంలో అర్హులకు కేటాయిస్తాం**
**క్యూర్ పరిధిలో హౌసింగ్ పై**
**మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నంతో మంత్రి పొంగులేటి సమీక్ష**



**హైదరాబాద్,మార్చి16 :** హైదరాబాద్,రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణానికి అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో నివసించే పేద ప్రజల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా స్థలాలను గుర్తించాలని సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలకు అనుగుణంగా పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని దీనికి తగ్గట్టుగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో సహచర మంత్రులు శ్రీధర్ బాబు, అజారుద్దీన్, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి క్యూర్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్ రూం ఇళ్ల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు, అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లకు పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక ఉండాలని ఎలాంటి రాజకీయ వత్తిళ్లకు తలోగ్గవద్దని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు పొంది వాటిలో నివసించకుండా అ÷-దదెకు ఇస్తున్నవారికి, ఏళ్ల తరబడి తాళాలు వేసి ఖాళీగా ఉ ంచుతున్నవారికి నోటీసులు జారీ చేయాలని , నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, ఎంతమంది స్పందించారు అక్కడ నివాసం ఉండకపోవడానికి వారు చెప్పిన కారణాలపై ఆరా తీశారు. 2 బిహెచ్‌కే, జెఎన్ ఆర్.ఎమ్ తదితర పథకాల్లో ఇళ్లు పొంది నివాసం ఉ ండని ఇళ్లను మే 1వ తేదీ నుంచి పరిశీలించాలని అటువంటి వారికి నోటీసులు ఇచ్చి, స్పందించని పక్షంలో కేటాయింపులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. నోటీసులపై స్పందించిన లబ్దిదారుల నుంచి బాండు పేపరుపై తాము ఇక్కడే నివాసం ఉంటామని లేదంటే రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి అప్పగిస్తూ వారి నుంచి హామీ పొందాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు ఆమోదం తెలిపేలా అండర్ టేకింగ్ తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోగల కాలనీల్లో ముఖ్యంగా విద్యుత్, త్రాగునీరు, డ్రైనేజ్ వంటి కనీస వసతులను తప్పని సరిగా కల్పించాలని, ఈ విషయంలో జిహెచ్ ఎంసీ సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 22వేల ఇళ్లకు విద్యుత్ మీటర్లను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం టవర్లు మొత్తం పూర్తయ్యేవరకూ ఆగకుండా పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు లబ్దిదారులకు కేటాయించాలన్నారు. అదేవిధంగా వివిధ కాలనీల్లో ఉన్న వాణిజ్య సముదాయాలను అ÷-దదె ప్రాతిపదకన గాకుండా వేలం పద్ధతిలో వాటిని విక్రయించాలని ఆ విధంగా వచ్చిన డబ్బును అక్కడి సొసైటీ, ప్రభుత్వం పేరిట జాయింట్ అకౌంట్ పేరిట వేయాలన్నారు. అంతేగాక ప్రజా ప్రయోజన కార్యాలయాల కోసం కూడా కొన్నింటిని కేటాయించాలని తెలిపారు. ఈ విషయంలో సహకార శాఖ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి, ఎండీ, వీపీ గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకిచ్చిన హామీలపై స్పష్టత ఏదీ

## ఉద్యోగుల బకాయిలపై ప్రస్తావన లేదే

## గవర్నర్ ప్రసంగంపై బిజెపి పెదవి విరుపు

**హైదరాబాద్,మార్చి16 :** గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు ఇచ్చిన హామీల గురించి ఎలాంటి ప్రస్తావన లేదని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. రైతుల ఇబ్బందులు, ఉద్యోగాల భర్తీ గురించి లేదని, ఉద్యోగుల సమస్యలపై ప్రస్తావించలేదని తెలిపారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... విశ్రాంత ఉద్యోగులు గోస పడుతున్నారని... ఎన్నేళ్లు అయినా వారికి బెనిఫిట్స్ అందడం లేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన చట్టాలు ఉన్నప్పటికీ వారికి అందాల్సిన సౌకర్యాలు అందడం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. బీసీలను పూర్తిగా మోసం చేస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సబ్ ప్లాన్ ముచ్చటే లేదన్నారు. ప్రభుత్వ అప్పులపై స్పష్టత లేదని తెలిపారు. గవర్నర్‌తో ప్రభుత్వం ఏదైనా మాట్లాడించేటప్పుడు ఆలోచించాలని.. అన్నీ అవాస్తవాలు, గందరగోళమైన మాటలు మాట్లాడించారని బీజేపీ ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రభుత్వం విస్మరించినంత మాత్రాన తాము విడిచిపెట్టమని... తెలంగాణ ప్రజల గొంతుకగా బీజేపీ నిలబడి పనిచేస్తుందన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. సెంబ్లీలో తెలంగాణ గేయం తర్వాత వందేమాతరం గేయాన్ని ఆలపించకుండా ఎంఐఎం ఎమ్మెల్యేలు బయటకు వెళ్లడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని అవమానించారని మండిపడ్డారు. ఎంఐఎం ఎమ్మెల్యేల తీరు సిగ్గుచేటన్నారు. వందేమాతరం వినడానికి ఆసక్తి లేకనా? లేక దేశభక్తి లేకపోవడమా అని ప్రశ్నించారు. వందేమాతరం గేయాన్ని అవమానపరిచిన ఎంఐఎం ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

# ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

## భోజనం కోసం ఆగిన కారుపై దూసుకెళ్లిన కంటెయినర్

## ఇద్దరు వ్యక్తులు అక్కడిక్కడే దుర్మరణం

**మేడ్చెల్,మార్చి16 :** రోడ్డు పక్కన భోజనం కోసం కారు ఆపడమే వారి పాలిట శాపమైంది. కంటైనర్ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ఓఆర్ఆర్ పక్కన కారు నిలిపి భోజనం చేస్తున్న సమయంలో వెనుక నుంచి కంటైనర్ ఢీ కొట్టడంతో.. కారులో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతులను మౌలాలికి చెందిన మహ్మద్ యూసుఫ్ ఖాన్ (51), కాప్రా సాకేత్‌కు చెందిన హుస్సేన్ (53)గా గుర్తించారు. మద్యం మత్తులో కంటైనర్ నడిపిన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన శామీర్‌పేట సమీపంలో ఔటర్ రింగ్ రోడ్ పై జరిగింది. కారు ఆపి భోజనం చేస్తున్న వారిపై ఓ కంటైనర్ వేగంగా దూసుకెళ్లడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం ప్రకారం, నగరంలోని మౌలాలి ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆడి కారులో ప్రయాణిస్తున్నారు. శామీర్‌పేట సమీపంలోని ఓర్ఆర్‌పై వారు కారును ఆపి పక్కనే నిలబడి భోజనం చేస్తున్నారు. ఈ సమయంలో వేగంగా వచ్చిన కంటైనర్ వారిపై దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో శామీర్‌పేట పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. మృతుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదానికి అతి వేగమే కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# రేపు రాష్ట్రవ్యాప్తంగా 'ఫార్మర్ కిట్స్'

## పంపిణీని ప్రారంభించనున్న మంత్రి తుమ్మల .. 61,125 మంది రైతులకు లబ్ది

## జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా కార్యక్రమం

**హైదరాబాద్,మార్చి16 :** రాష్ట్రంలోని ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన రైతులకు 'ఫార్మర్ కిట్స్' పంపిణీ చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయం నుండి లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 489 క్లస్టర్లలో ఈ పంపిణీ జరుగుతుంది. ప్రతి క్లస్టర్‌కు 125 మంది చొప్పున, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 61,125 మంది రైతులకు ఈ కిట్లను అందజేయడం జరుగుతుంది. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, గుర్తింపు కోసం ఈ కిట్‌లో క్లాత్ బ్యాగ్, క్షేత్ర దర్శిని డైరీ, గుర్తింపు కార్డు, ప్రత్యేక క్యాలెండర్, టోపీ, పెన్ను మరియు చిన్న ప్యాకెట్ డైరీ వంటి వస్తువులు ఉంటాయి. సచివాలయంలో మంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, ఆయా జిల్లాల్లోని రైతు వేదికలలో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రైతులకు ఈ కిట్లను పంపిణీ చేస్తారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.

# సైబర్ నేరగాళ్ల ఉచ్చులో వృద్ధురాలు

## నిర్మలా సీతారామన్ డీప్‌ఫేక్ ఫోటోలతో మోసం

## ఏకంగా రూ. 87.96 లక్షలు కొట్టేసిన మోసగాళ్లు

**హైదరాబాద్,మార్చి16:** సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులతో ప్రజల వద్ద నుండి డబ్బులు లాగేస్తున్నారు. తాజాగా దేశ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫోటోలు, వీడియోలనే వాడుకుంటూ కేటుగాళ్లు రెచ్చిపోయారు. డీప్ ఫేక్ సాంకేతికతతో సృష్టించిన నకిలీ వీడియోను చూసి నిజమని నమ్మిన ఓ వృద్ధురాలు ఏకంగా రూ. 87.96 లక్షలు పోగొట్టుకున్న ఘటన మల్కాజిగిరిలో వెలుగుచూసింది. అసలేం జరిగిందన్న విషయానికి వెళితే.. బాధిత వృద్ధురాలు సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తుండగా, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ స్టాక్ మార్కెట్ పెట్టుబడుల గురించి వివరిస్తున్నట్లు ఉన్న ఒక వీడియో ఆమె కంటపడింది. అది ఏఐతో సృష్టించిన నకిలీ వీడియో అని తెలియని ఆమె, సాక్షాత్తు మంత్రి గారే చెబుతున్నారు కదా అని నమ్మి ఆ వీడియో లింక్‌ను క్లిక్ చేశారు. లింక్ క్లిక్ చేసిన వెంటనే సైబర్ కేటుగాళ్లు రంగంలోకి దిగారు. బాధితురాలికి వాట్సాప్ కాల్స్ చేసి తాము పెద్ద ట్రేడింగ్ సంస్థ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో 'ట్రేడ్ యాప్' అనే ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించారు. ఇందుకోసం ఆమె ఐడీ ప్రూఫ్స్, బ్యాంక్ అకౌంట్ వివరాలు తీసుకుని, ఒక యూజర్ ఐడీ, పాస్వర్డ్ క్రియేట్ చేసి ఇచ్చారు. ఇక అంతే వారి అసలైన ప్లాన్ అమలు చేశారు. మొదట నమ్మకం కలిగించడానికి కేవలం రూ. 60 వేలు ఇన్వెస్ట్ చేయించారు. ఆ తర్వాత లాభాలు వస్తున్నట్లు నకిలీ గ్రాఫిక్స్ తో స్క్రీన్ పై చూపించి.. దఫదఫాలుగా మొత్తం రూ. 87.96 లక్షలు డిపాజిట్ చేయించుకున్నారు. తన అకౌంట్‌లో భారీగా డబ్బు కనిపిస్తుండటంతో, బాధితురాలు ఆ మొత్తాన్ని విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించారు. అయితే సాంకేతిక కారణాలు చెప్తూ కేటుగాళ్లు ఆమెను అడ్డుకున్నారు. ఎంత ప్రయత్నించినా డబ్బు చేతికి రాకపోవడంతో, తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే మల్కాజిగిరి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఇక బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఆ డబ్బు ఏ అకౌంట్ల లోకి వెళ్లిందో దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి అనుమానాస్పద లింక్స్ లేదా కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# బెంగాల్ షెడ్యూల్ విడుదల.. కీలక అధికారుల బదిలీ

### డిజిపి, చీఫ్ సెక్రటరీల బదిలికి ఇసి ఆదేశాలు

### ఇసి తీరుపై మండిపడ్డ మమతా బెనర్జీ



**న్యూఢిల్లీ,మార్చి16 :** పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన గంటల వ్యవధిలోనే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన చర్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. రాష్ట్ర డీజీపీ, చీఫ్ సెక్రటరీ సహా నలుగురు కీలక వ్యక్తులపై ఈసీ వేటు వేసింది. ఆయా పదవుల్లో కొత్తవారిని నియమించాలని ఆదేశిస్తూ బెంగాల్ ప్రభుత్వానికి లేఖ పంపింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తిని ఆ బాధ్యతల నుంచి తొలగిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ఆ స్థానంలో దుష్యంత్ నరియాలను నియమించింది. మ-రోవైపు హోం శాఖ కార్యదర్శి జగదీశ్ ప్రసాద్ మీనాపైనా ఈసీ వేటు వేసింది. ఈ పదవిలో ఐఏఎస్ అధికారి సంఘమిత్ర ఘోష్‌ని నియమించింది. ఇక, రాష్ట్ర డీజీపీ పీయూష్ పాండేను తొలగించి సీనియర్ ఐపీఎస్ అధికారి సిద్ నాథ్ గుప్తాకు ఆ బాధ్యతలు అప్పగించింది. కోల్‌కతా పోలీసు కమిషనర్‌గా ఉన్న సుప్రతిమ్ సర్కార్‌ను తప్పించి.. అజయ్ కుమార్ నంద్‌ను నియమించింది. రాష్ట్రంలో ఎన్నికల సన్నద్ధత కోసం చేపట్టిన సమీక్ష అనంతరం వీరిని ఆ పదవుల నుంచి తొలగించాలని నిర్ణయించినట్లు ఈసీ తమ లేఖలో వెల్లడించింది. తొలగించిన అధికారులను ఎన్నికలు పూర్తయ్యేంతవరకు పోలింగ్ సంబంధిత విధుల్లోకి తీసుకోవద్దని ఈసీ ఆదేశించింది. తమ నిర్ణయాలు తక్షణమే అమలు చేయాలని, దీనిపై ఈ మధ్యాహ్నం లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సూచించింది.అయితే, ఈసీ చర్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించింది. ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ సోమవారం సాయంత్రం వీధుల్లో ఆందోళన చేపడుతామని వెల్లడించారు. దీంతో ఈ వ్యవహారం కాస్తా రాజకీయ దుమారం రేపుతోంది. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న లెక్కింపు ఉండనుంది. ఇదిలాఉండగా ఓటర్ల జాబితా, సవరణల వంటి విషయాల్లో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం, ఎలక్షన్ కమిషన్‌ల మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే.

# ముంద్రా పోర్టుకు చేరుకున్న శివాలిక్

### ఖతార్ నుంచి గ్యాస్‌తో వచ్చిన నౌక.. భారత్‌కు దక్కనున్న భారీ ఊరట

**ముంద్రా,ఫిబ్రవరి 16 :** మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త అందింది. ఖతార్ నుండి లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన భారీ ట్యాంకర్ 'శివాలిక్', సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరాన్, అమెరికా మధ్య ఘర్షణల కారణంగా ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి మూసివేత ముప్పు పొంచి ఉంది. ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో, గల్ఫ్ దేశాల నుండి భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమోనన్న ఆందోళన నెలకొంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో 'శివాలిక్' నౌక సురక్షితంగా ప్రయాణించి లక్ష్యాన్ని చేరుకోవడం భారత ఇంధన భద్రతకు సానుకూల సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు. శివాలిక్ ఎల్‌పిజి ట్యాంకర్ ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ నుండి వేల టన్నుల ఎల్‌పీజీని మోసుకొచ్చింది. ఉద్రిక్తతల దృష్ట్యా భారత నావికాదళం గల్ఫ్ ప్రాంతంలో నిఘాను పెంచిన సంగతి తెలిసిందే. భారతీయ నౌకల ప్రయాణాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతాపరమైన భరోసా కల్పిస్తోంది. గుజరాత్‌లోని అదానీ ముంద్రా పోర్టులో ఈ గ్యాస్ అన్-లోడింగ్ పక్రియ ప్రారంభమైంది. ఇది దేశీయ గ్యాస్ అవసరాలకు ఎంతో కీలకం. ప్రపంచవ్యాప్తంగా రవాణా అయ్యే చమురులో సుమారు 20 శాతం ఈ జలసంధి ద్వారానే సాగుతుంది. ఇరాన్-అమెరికా యుద్ధం వల్ల ఈ మార్గం మూసుకుపోతే అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు ఈ మార్గంలో ప్రయాణాన్ని నిలిపివేయగా, భారత్ మాత్రం తన వ్యూహాత్మక సంబంధాల ద్వారా సరఫరాను కొనసాగిస్తోంది.

# ఇరాన్ డ్రోన్ దాడులు తీవ్రం

### దుబాయ్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో దాడి

### ఇంధన ట్యాంకర్ వద్ద చెలరేగిన మంటలు

**టెహ్రాన్,ఫిబ్రవరి 16 :** ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్.. డ్రోన్ దాడుల ను తీవ్రతరం చేసింది. తన పొరుగుదేశాల్లోని అమెరికా స్థావరాలే లక్ష్యంగా డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ దాడులు చేసింది. ఈ సందర్భంగా ఒక డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దాంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీస్ జారీచేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచనచేశారు. అంతేగాక పలు విమానాలను అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ట్యాంక్‌పై దాడి నేపథ్యంలో ఈ ప్రాంతంలోని కీలకమైన ఇతర మౌలిక సదుపాయాల వద్ద భద్రత పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.

# హర్మ్యూజ్ జలసంధి వద్దకు యుద్ధనౌకలు

### ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించిన ఆస్ట్రేలియా

### సంయమనం పాటించాలన్న జపాన్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 16 :** హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను మిత్ర దేశాలు తిరస్కరించాయి. ప్రస్తుతానికి తమకు ఆ ఆలోచన లేదని తేల్చి చెప్పాయి. ట్రంప్ అభ్యర్థనను ఆస్ట్రేలియా తోసి పుచ్చింది. తాము యుద్ధ నౌకలను పంపబోమని స్పష్టం చేసింది. 'ఆ జలసంధి ఎంత కీలకమో మాకు తెలుసు. కానీ అక్కడకు మేము యుద్ధ నౌకలను పంపబోము. అసలు యుద్ధ నౌకల కోసం మమ్మల్ని ఎవరూ సంప్రదించలేదు. మేము ఈ విషయంలో జోక్యం చేసుకోలేదు' అని ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ చెప్పారు. ట్రంప్ అభ్యర్థనపై జపాన్ ఆచితూచి స్పందించింది. ఈ విషయంలో సంయమనం అవసరమని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో తాము మేరిటైమ్ చర్యల గురించి ఆలోచించట్లేదని పేర్కొంది. ఇతర ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించినట్టు తెలిపింది. అమెరికాతో మరిన్ని చర్చల తరువాత ఈ విషయంలో ఒక నిర్ణయానికి వస్తామని దక్షిణ కొరియా పేర్కొంది. సమగ్ర సమీక్ష తరువాత ఈ విషయంలో ముందడుగు వేస్తామని వెల్లడించింది.

బ్రిటన్ కూడా ఈ విషయమై ఆచితూచి స్పందించింది. యుద్ధ నౌకలను పంపించే విషయంలో ట్రంప్‌తో చర్చిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో కూడా చర్చించినట్టు తెలిపారు. సోమవారం జరగనున్న సమావేశంలో మరోసారి ఈ విషయమై చర్చిస్తామని అన్నారు.హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు యుద్ధ నౌకలను పంపించాలని పలు దేశాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం అభ్యర్థించిన విషయం తెలిసిందే. తమ పరిధిలోని ప్రాంతాన్ని ఆయా దేశాలు రక్షించుకోవాలని అన్నారు. ఇంధన అవసరాల కోసం హోర్ముజ్ జలసంధిపై అమెరికా అంతగా ఆధారపడలేదని అన్నారు. ఇతర దేశాలకే ఆ అవసరం ఎక్కువని కామెంట్ చేశారు. ఈ సందర్భంగా చైనా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. చైనా దిగుమతుల్లో అధిక శాతం హోర్ముజ్ మీదుగానే వెళుతున్నాయని అన్నారు. అయితే, హోర్ముజ్ జలసంధిని తెరిపించే ప్రయత్నాల్లో చైనా భాగం అవుతుందా? లేదా? అనే విషయంపై ఆయన స్పందించేందుకు నిరాకరించారు.

# గల్ఫ్ యుద్ధం వేళ చైనా దూకుడు

### తైవాన్ దిశగా యుద్ధనౌకలు, విమానాల మొహరింపు

**తైపీ,ఫిబ్రవరి 16 :** గల్ఫ్ యుద్ధంతో అంతా అటువైపు దృష్టి పెట్టగా చైనా మరోమారు తైవాన్‌పై దృష్టి సారించింది. గత రెండు వారాలుగా కొంత నిశ్శబ్దంగా ఉన్న చైనా సైన్యం.. మళ్ళీ తైవాన్ సరిహద్దుల్లో తన ప్రాబల్యాన్ని చాటుకోవడం మొదలుపెట్టింది. తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, గత 24 గంటల్లో భారీ సంఖ్యలో , నౌకలు చైనా యుద్ధ విమానాలు తైవాన్ గగనతలంలోకి ప్రవేశించాయి. కాగా, ఫిబ్రవరి 27 నుండి మార్చి 13 వరకు తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధ విమానాల రాక గణనీయంగా తగ్గింది. సాధారణంగా ప్రతిరోజూ పదుల సంఖ్యలో విమానాలను పంపే చైనా, ఈ 16 రోజుల కాలంలో కేవలం 7 విమానాలను మాత్రమే పంపింది. అయితే, ఈ ఆకస్మిక విరామానికి కారణమేంటో రక్షణ నిపుణులకు సైతం అంతుచిక్కలేదు. కానీ, ఆదివారంనుండి చైనా మళ్ళీ తన దూకుడును పెంచింది. తైవాన్ చుట్టూ సుమారు 26 చైనా సైనిక విమానాలను గుర్తించారు. వీటిలో 16 విమానాలు తైవాన్ నైరుతి ఎయిర్ డిఫెన్స్ ఐడెంటిఫికేషన్ జోన్ లోకి ప్రవేశించాయి. విమానాలతో పాటు 7 చైనా యుద్ధ నౌకలు కూడా తైవాన్ సముద్ర తీరానికి సమీపంలో చక్కర్లు కొడుతున్నాయి. ఫిబ్రవరి 25న 30 విమానాలు వచ్చిన తర్వాత, మళ్ళీ ఈ స్థాయిలో విమానాలు రావడం ఇదే తొలిసారి. ఇలాఉండగా, మార్చి 31న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించనున్నారు. ఇక, చైనా విమానాలు లేని సమయంలో కూడా వారి యుద్ధ నౌకలు సముద్రంలోనే ఉన్నాయని తైవాన్ రక్షణ మంత్రి వెల్లింగ్టన్ కూ స్పష్టం చేశారు. చైనా నుండి ముప్పు ఏమాత్రం తగ్గలేదని.. తాము నిరంతరం అప్రమత్తంగానే ఉన్నామని ఆయన పేర్కొన్నారు.


# హర్మ్యూజ్ రక్షణపై చైనా మెలిక

### సైనిక చర్య నిలిపివేస్తే కలసి వస్తాం.. అమెరికాకు స్పష్టం చేసిన డ్రాగన్ దేశం

**వాషింగ్టన్,మార్చి16 :** హోర్ముజ్ జలసంధిని రక్షించుకునేందుకు, ఇంధన రవాణాను క్రమబద్ధీకరించేందుకు ముందుకు రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన పిలుపునకు చైనా స్పందించింది. హోర్ముజ్ రక్షణ కోసం ముందుకు వస్తామని, అయితే ముందుగా పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని చైనా షరతు పెట్టింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఓ ప్రకటన విడుదల చేశారు. పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, ప్రాంతీయ శాంతి, స్థిరత్వం దెబ్బతింటున్నాయని లిన్ జియాన్ అన్నారు. ఉద్రిక్తతలు పెరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని అమెరికాకు ఆయన సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధ్యమవుతుందని అన్నారు. అందుకోసం అన్ని దేశాలు కలిసి ముందుకు రావాలని సూచించారు. మార్చి నెల చివర్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాలో పర్యటించాల్సి ఉంది. ప్రస్తుతం ట్రంప్ బీజింగ్ పర్యటన గురించి అమెరికాతో చర్చలు జరుగుతున్నాయని లిన్ జియాన్ అన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంలో ట్రంప్ పర్యటన కీలకం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చైనా పర్యటన గురించి ట్రంప్ తాజాగా మాట్లాడుతూ.. హోర్ముజ్ జలసంధి రక్షణ విషయంలో చైనా సమాధానాన్ని బట్టి తన పర్యటన షెడ్యూల్ ప్రకారం ఉంటుందా.. వాయిదా పడుతుందా అనే విషయంలో నిర్ణయం తీసుకుంటానన్నారు.

# బెంగాల్, కేరళలో బిజెపి తొలి జాబితా విడుదల

### మమతపై పోటీకి సువేందును బరిలోకి దింపి బిజెపి



**కోల్‌కతా,మార్చి16 :** పశ్చిమ బెంగాల్, కేరళ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగిన మరుసటి రోజే భాజపా తన అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్థానమైన భవానీపుర్ నుంచి రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సువేందు అధికారిని బరిలోకి దింపింది. నందిగ్రామ్ నుంచి కూడా ఆయనే పోటీ చేయనున్నారు. కోల్‌కతా నడిబొడ్డున ఉన్న భవానీపుర్ నియోజకవర్గం 2011 నుంచి తృణమూల్ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. మరోవైపు, కేరళ అసెంబ్లీ ఎన్నికలకు కూడా భాజపా 47మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ నేమమ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. మరో కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్‌కు కూడా తొలి జాబితాలో చోటు దక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీపై పోటీ చేసి ఓడిపోయిన నవ్య హరిదాస్‌ను భాజపా అసెంబ్లీ ఎన్నికల బరిలో దింపింది. కేరళలో మొత్తం 140 అసెంబ్లీ సీట్లకు ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనుండగా.. పశ్చిమ బెంగాల్‌లో రెండు విడతల్లో ఏప్రిల్ 23న 152 స్థానాలకు, 29న 142 సీట్లకు పోలింగ్ నిర్వహించనున్నారు.

# అన్ని రాష్ట్రాల్లోనూ గ్యాస్ నిల్వలు ఉన్నాయి

### వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన



**న్యూఢిల్లీ,మార్చి16 :** వంట గ్యాస్ సరఫరాపై కేంద్రం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సరఫరా చేస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అన్ని రాష్ట్రాల్లో ఎల్పీజీ స్టాక్ ఉందని తెలిపింది. హర్మ్యూజ్ దగ్గర భారత నౌకలన్నీ క్షేమంగానే ఉన్నాయని, శివాలిక్ నౌకలో 48 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్ ఉందని కేంద్రం వెల్లడించింది. కాగా, ఖతార్ నుండి లిక్వి÷డ్ పెట్రోలియం గ్యాస్‌తో బయలుదేరిన 'శివాలిక్' నౌక సురక్షితంగా గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు చేరుకుంది. హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతలు పతాక స్థాయిలో ఉన్న సమయంలో ఈ నౌక రాక ప్రాధాన్యత సంతరించుకుంది.కేంద్రం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను పూర్తిగా నిలిపి వేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు మెల్లమెల్లగా మూతపడుతున్నాయి. హాస్టల్స్ మెనూను పూర్తిగా మార్చేశాయి. కేవలం ఒక కర్రీతో సరిపెడుతున్నాయి. గ్యాస్ కొరత కారణంగా పలు దేవాలయాలు తాత్కాళికంగా ప్రసాదం తయారీని నిలిపివేశాయి. సీఎన్‌జీ బంకుల్లోనూ గ్యాస్ నిల్వలు అడుగంటుతున్నాయి. దీని కారణంగా గ్యాస్‌తో నడిచే వందలాది ఆటోలు నిలిచిపోతున్నాయి. డొమస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగదారులకు కూడా కష్టాలు తప్పటం లేదు. బుకింగ్, డెలివరీ విషయంలో నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. యుద్ధ పరిస్థితులకు తోడు.. పండుగ సమయం కావటంతో గ్యాస్ సిలిండర్లకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడి సిలిండర్ తీసుకుంటున్నారు.

# మొక్కజొన్న కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి

### రైతులతో కలసి కలెక్టరేట్ వద్ద ధర్నా



**జగిత్యాల,మార్చి16 :** అన్నదాతల సమస్యలను పట్టించుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంట కొనుగోళ్లలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆగ్రహించారు. రైతుల పంటకు తగిన ధర దక్కకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మొక్కజొన్నను మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల పట్టణంలో రైతులు సోమవారంపెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జీవన్‌రెడ్డి నాయకత్వం వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మొక్కజొన్న రైతులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలపడానికి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. రైతుల చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ తమ ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. మొక్కజొన్న పంటకు తగిన ధర ఇవ్వాలని, వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతులు పంట పండించి మార్కెట్‌కు తీసుకువస్తే ప్రభుత్వం సరైన విధంగా కొనుగోళ్లు చేయడం లేదని ÷ర్ అయ్యారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు మధ్యవర్తుల చేతిలో నష్టపోతున్నారని పేర్కొన్నారు. మార్కెట్లో ధరలు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుంచి మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో మంచి వ్యవస్థ ఉండేదని జీవన్‌రెడ్డి ప్రస్తావించారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు. అలాగే గత పదేళ్లలో కూడా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు జరిగినట్లు తెలిపారు. అయి-ంతే కాంగ్రెస్ సర్కార్‌లో ప్రస్తుతం ఆ విధానం సరిగా అమలు కావట్లేదని విమర్శించారు. ప్రభుత్వం మళ్లీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు జరుగుతుందని జీవన్‌రెడ్డి తెలిపారు. అయితే ఈసారి పంటకు సరైన ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పంటను పండించడానికి రైతులు ఎరువులు, విత్తనాలు, నీటి ఖర్చుల కోసం అప్పులు చేసి సాగు చేస్తారని, కానీ మార్కెట్లో ధరలు తక్కువగా ఉండటంతో వారికి పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు తమ పంటను నిల్వ చేయలేక తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. పండించిన పంటకు కనీస ధర లభించకపోతే రైతన్నలు ఆర్థికంగా కుంగిపోతారని తెలిపారు. అన్నదాతల పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతన్నల నుంచి నేరుగా మొక్కజొన్న కొనాలని ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి కోరారు-

## బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్

# మ్యాచ్‌ల నిర్వహణకు అనుమతి


బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించుకోవడానికి కర్ణాటక ప్రభుత్వం అనుమతించింది. గత సంవత్సరం ఆర్సీబీ విజయోత్సవ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో నిపుణుల కమిటీ భద్రత, సంసిద్ధత చర్యలపై ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. విధాన సౌధలో హోంమంత్రి జి.పరమేశ్వర అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు అనుకూలంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు హోమ్ మ్యాచ్‌లకు ఈ వేదిక ఆతిథ్యం ఇవ్వనుంది. ఆర్సీబీ జట్టు చిన్నస్వామి స్టేడియంలో 5 లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. అలాగే రెండో హోమ్ గ్రౌండ్ రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణసింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. ఐపీఎల్‌లో ఒక ప్లేఆఫ్ మ్యాచ్‌ను బెంగళూరులో నిర్వహించే అవకాశం ఉందని తెలుస్తోంది. గత సంవత్సరం జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో, జస్టిస్ కున్హా నివేదిక సిఫార్సులను అనుసరించి, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణకు క్రౌడ్ మేనేజ్‌మెంట్, భద్రతా చర్యలను ప్రవేశపెట్టినట్లు కార్యదర్శి సంతోష్ మీనన్ వెల్లడించారు. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణ సందర్భంగా 35 వేల మంది ప్రేక్షకులను మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తారు. చివరి నిమిషంలో రద్దీని నివారించడానికి మ్యాచ్‌కు మూడు నుంచి నాలుగు గంటల ముందే స్టేడియం గేట్లను తెరుస్తారు. మహిళలు, పిల్లలకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయనున్నారు. మ్యాచ్ టిక్కెట్ కలిగి ఉన్న వారికి బెంగళూరు మెట్రోలో ఉచిత ప్రయాణ వసతి కల్పించనున్నారు.





## పాక్ ఆటగాడిని కొనుగోలు చేసిన సన్‌రైజర్స్

### గవాస్కర్ సంచలన వ్యాఖ్యలు



ది హండ్రెడ్ లీగ్ కోసం సన్ రైజర్స్ లీడ్స్ జట్టు పాకిస్థాన్ ఆటగాడు అబ్రార్ అహ్మద్‌ను కొనుగోలు చేయడంపై సునీల్ గవాస్కర్ స్పందించాడు. పాకిస్థాన్ క్రికెటర్లకు ఫీజు చెల్లించడమంటే భారతీయుల మరణానికి కంట్రిబ్యూట్ చేసినట్లేనని సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత్‌కు చెందిన యాజమాన్యాలు కలిగిన జట్లు ఏవైనా నైతికంగా పాకిస్థాన్ క్రికెటర్లను దూరం ఉంచాల్సిందే అన్నాడు. పాకిస్థాన్ క్రికెటర్లను 2008లోనే ఐపీఎల్ నుంచి బహిష్కరించిన విషయాన్ని గవాస్కర్ గుర్తు చేశాడు. మన దేశానికి చెందిన క్రికెట్ ఫ్రాంచైజీ ది హండ్రెడ్ లీగ్‌లో పాకిస్థాన్ క్రికెటర్‌ను తీసుకున్నదని, కానీ 2008లో ముంబై దాడులు జరిగినప్పటి నుంచి మనం పాకిస్థాన్ క్రికెటర్లను దూరం పెట్టామని గుర్తు చేశాడు. పాకిస్థాన్ క్రికెటర్లు తమకు ఐపీఎల్‌లో ఫీజు ద్వారా వచ్చిన మొత్తంలో ప్రభుత్వానికి ఆదాయపు పన్ను చెల్లిస్తాడని, ఆ సొమ్ము అక్కడి ప్రభుత్వం ఆయుధాలను కొనుగోలు చేయడానికి ఉపయోగిస్తుందని ఆందోళన వ్యక్తం చేశాడు. ఆ ఆయుధాలను వారు మన దేశం పైనే ప్రయోగిస్తారని మండిపడ్డారు. అంటే పాకిస్థాన్ ఆటగాళ్లకు మన జట్టు యాజమాన్యాలు చెల్లించే ఫీజు భారత ప్రజలు, సైనికుల ప్రాణాలు తీయడానికి పరోక్షంగా కారణమవుతుందని అన్నాడు. ఎవరైనా పాకిస్థాన్ ఆటగాళ్లు, సినిమా తారలను పక్కన పెట్టాల్సిందేనని స్పష్టం చేశాడు. పాక్ క్రికెటర్లకు చెల్లించే సొమ్ము పరోక్షంగా మనవారి ప్రాణాలను తీయడానికి కారణమవుతోందని వ్యాఖ్యానించాడు. న్యూజిలాండ్‌కు చెందిన డానియల్ వెట్టోరికి ఈ విషయం అర్థం కాకపోవడం వల్ల పాకిస్థాన్ క్రికెటర్‌ను తీసుకుందామని భావించి ఉండవచ్చని, కానీ యాజమాన్యానికి అర్థం కావాలి కదా అని అభిప్రాయపడ్డాడు. భారతీయుల జీవితాల కంటే టోర్నీలో గెలవడం ముఖ్యమా అని ప్రశ్నించాడు.

## ఫిఫా వరల్డ్ కప్ లో ఆడాలని

# ఇరాన్ నిర్ణయం

2026 ఫిఫా వరల్డ్ కప్ నుంచి ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు తప్పుకోబోతోందంటూ వస్తున్న ఊహాగానాలకు ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (ఏఎఫ్‌సీ) తెరదించింది. ఈ విషయంపై తమకు ఇరాన్ నుంచి అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని సోమవారం స్పష్టం చేసింది. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల్లో జరగనున్న ఈ మెగా టోర్నమెంట్‌కు ఇరాన్ ఇప్పటికే అర్హత సాధించిన విషయం తెలిసిందే. టెహ్రాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసిన తర్వాత ఈ ప్రచారం మొదలైంది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ మరణించారని వార్తలు వచ్చిన నేపథ్యంలో, తమ జట్టు ప్రపంచకప్ లో పాల్గొనడం కష్టమేనని ఆ దేశ క్రీడాశాఖ మంత్రి వ్యాఖ్యానించడంతో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాలపై ఏఎఫ్‌సీ జనరల్ సెక్రటరీ విండ్సర్ జాన్ స్పందిస్తూ, "ఇది చాలా భావోద్వేగపూరిత సమయం. చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు. కానీ ఆడాలా వద్దా అని నిర్ణయించుకోవాల్సింది ఇరాన్ ఫుట్‌బాల్ సమాఖ్యే. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, వారు వరల్డ్ కప్‌లో పాల్గొంటున్నట్టు మాకు చెప్పారు. వారు మా సభ్యులు, వారు ఆడాలని మేము కోరుకుంటున్నాం. వారి సమస్యలు పరిష్కరించుకుని టోర్నీలో పాల్గొంటారని ఆశిస్తున్నాం" అని తెలిపారు. మరోవైపు, జరుగుతున్న ప్రచారాన్ని ఇరాన్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు తీవ్రంగా ఖండించింది. ఫిఫా నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొనకుండా తమను అడ్డుకునే అధికారం ఏ దేశానికీ లేదని తేల్చిచెప్పింది. "వరల్డ్ కప్ అనేది ఒక చారిత్రాత్మక ఈవెంట్. దీనికి నిర్వాహక సంస్థ ఫిఫానే తప్ప ఏ దేశమూ కాదు. మమ్మల్ని ఎవరూ ప్రపంచ కప్ నుంచి తప్పించలేరు" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఒకవేళ ఇరాన్ అధికారికంగా తప్పుకుంటే, ఆధునిక శకంలో ఇలాంటి ఘటన జరగడం ఇదే మొదటిసారి అవుతుంది.




## పాక్‌పై బంగ్లా థ్రిల్లింగ్ విక్టరీ

### 2-1తో సిరీస్ కైవసం



పాకిస్థాన్‌తో జరిగిన మూడో వన్డేలో బంగ్లాదేశ్ 11 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో కైవసం చేసుకుంది. ఓపెనర్ తాంజిద్ హసన్ (107) అద్భుత సెంచరీతో చెలరేగగా, పేసర్ తస్కిన్ అహ్మద్ (4/49) కీలక వికెట్లతో జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు.

ఆదివారం మిర్పూర్‌లోని షేర్ బంగ్లా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 290 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ తాంజిద్ హసన్ తన తొలి వన్డే సెంచరీని నమోదు చేశాడు. 107 బంతుల్లో 7 సిక్సర్లు, 6 ఫోర్లతో 107 పరుగులు చేశాడు. అతడికి తోడుగా తౌహిద్ హృదయ్ (48 నాటౌట్), కెప్టెన్ లిటన్ దాస్ (41) రాణించారు. పాకిస్థాన్ బౌలర్లలో హారిస్ రవూఫ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 291 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్.. బంగ్లా పేసర్ల ధాటికి 82 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ సల్మాన్ అలీ అఘా (106) అద్భుత శతకంతో జట్టును ఆదుకున్నాడు. 98 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో పాక్‌ను గెలుపు అంచుల వరకు తీసుకొచ్చాడు. అయితే, కీలక సమయంలో సల్మాన్‌ను ఔట్ చేసిన తస్కిన్ అహ్మద్ మ్యాచ్‌ను బంగ్లా వైపు తిప్పాడు. చివరికి పాకిస్థాన్ 50 ఓవర్లలో 279 పరుగులకు ఆలౌట్ అయింది. బంగ్లా బౌలర్లలో తస్కిన్‌కు తోడుగా ముస్తాఫిజుర్ రెహమాన్ 3 వికెట్లు, నహిద్ రాణా 2 వికెట్లు తీశారు. తొలి వన్డేలో బంగ్లాదేశ్ గెలవగా, రెండో వన్డేలో పాకిస్థాన్ విజయం సాధించిన సంగతి తెలిసిందే.

## మనం ఐసీసీ ట్రోఫీలను దొంగిలించాల్సిందే

### పాక్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్



పాకిస్థాన్ క్రికెట్ జట్టు వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, ఆ జట్టు మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. బంగ్లాదేశ్ చేతిలో వన్డే సిరీస్‌ను 2-1తో కోల్పోవడంపై అక్మల్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. "పాకిస్థాన్ జట్టు ప్రస్తుత ఆటతీరు చూస్తుంటే... నెదర్లాండ్స్ కూడా మనల్ని ఓడించి టెస్ట్ హోదా దక్కించుకునేలా ఉంది. మీరు మైదానంలో ప్రత్యర్థి జట్లను ఓడించి గెలవలేకపోతే, ఇకపై ఐసీసీ ట్రోఫీలను దొంగిలించి ఇంటికి తెచ్చుకోవాల్సిందే" అంటూ అక్మల్ తన దేశ జట్టుపై ఘాటుగా విమర్శలు గుప్పించాడు. ఆసియా కప్ -2025 విజేతగా నిలిచిన టీమ్ ఇండియా, పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోవడానికి నిరాకరించిన సంగతి తెలిసిందే. దీంతో, ఆ ట్రోఫీని నఖ్వీ తనతో పాటు తీసుకుపోయారు. ఆ ట్రోఫీని నేటికీ నఖ్వీ తన కార్యాలయంలోనే ఉంచుకున్నట్టు సమాచారం. ఈ చర్య వల్ల నఖ్వీ క్రీడా ప్రపంచంలోనే అత్యంత తీవ్ర అపఖ్యాతిని మూటకట్టుకున్నారు. 'ట్రోఫీ చోర్' అంటూ భారత నెటిజన్లు ఆయనను అప్పట్లో ఘోరంగా ట్రోల్ చేశారు. ఈ క్రమంలోనే పాక్ జట్టును అక్మల్ విమర్శిస్తూ... "మనం ట్రోఫీలను దొంగిలించాల్సిందే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## రహస్యంగా పెళ్లి చేసుకున్న క్రికెటర్ యశ్ దయాళ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) పేస్ బౌలర్ యశ్ దయాళ్ ఓ ఇంటివాడయ్యాడు. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ శ్వేత పుండిర్‌ను వివాహం చేసుకున్నాడు. గత నెలలోనే వీరి పెళ్లి జరిగినప్పటికీ, ఈ విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, వీరి వివాహం ఫిబ్రవరి 4న ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరిగింది. ఈ వేడుకకు కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. ఈ జంట తమ పెళ్లి విషయాన్ని సోషల్ మీడియాలో అధికారికంగా ప్రకటించలేదు. అయితే, దయాళ్ తో ఉన్న కొన్ని క్షణాలను శ్వేత తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో రూపంలో పంచుకున్నారు. ఢిల్లీకి చెందిన శ్వేత పుండిర్ ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, వ్లాగర్‌గా గుర్తింపు పొందారు. ఆమెకు ఇన్‌స్టాలో 5.87 లక్షల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా యశ్ దయాళ్ ఐపీఎల్‌లో మంచి పేరు తెచ్చుకున్నాడు. 2022లో గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడి, ఆ జట్టు



టైటిల్ గెలవడంలో భాగమయ్యాడు. ఆ తర్వాత 2024 సీజన్‌లో ఆర్సీబీకి మారాడు. గత ఏడాది ఆర్సీబీ తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకోవడంలోనూ దయాళ్ కీలక పాత్ర పోషించాడు. మార్చి 28న ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్ కోసం ఆర్సీబీ యాజమాన్యం అతడిని అట్టిపెట్టుకుంది. ఈ సీజన్‌లో టైటిల్ డిఫెండింగ్ లక్ష్యంతో బరిలోకి దిగుతున్న ఆర్సీబీకి దయాళ్ సేవలు కీలకం కానున్నాయి. మార్చి 28న చిన్నస్వామి స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఆర్సీబీ తమ తొలి మ్యాచ్ ఆడనుంది. కాగా, యశ్ దయాళ్ పై జైపూర్ లో లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం గతంలో సంచలనం సృష్టించింది. యశ్ దయాళ్ తనను హోటల్ కు పిలిచి లైంగిక దాడి చేశాడని 17 ఏళ్ల అమ్మాయి తీవ్ర ఆరోపణలు చేసింది. క్రికెట్ లో మంచి కెరీర్ అందిస్తానని హామీ ఇచ్చి, రెండేళ్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆమె వెల్లడించింది. దాంతో అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, మార్చి 16: సమస్యల పరిష్కారం కోసం ఎంతో దూరం నుంచి ప్రజావాణికి వచ్చే బాధితులకు అధికారులు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. బాధితులు వివరించిన సమస్యలను ఓపిగ్గా ఆలకించి వెంటనే పరిష్కరించగలిగే దరఖాస్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమయం తీసుకునే అంశాలపై సంబంధిత శాఖలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తూ బాధితుల్లో భరోసా నింపారు. వృద్ధులు, దివ్యాంగుల వద్దకు స్వయంగా వెళ్లి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి పరిష్కారం కోసం అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై మొత్తం 290 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమాన్ని సరికొత్త విధానంలో నిర్వహిస్తున్నారు. దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, కరీంనగర్ ఆర్డీవో కే మహేశ్వర్, హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ బాబు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు కేంద్ర పథకం లబ్ధి పొందాలి: వేముల అనిల్ కుమార్



కరీంనగర్: ముదిరాజులు, బెస్తలు మరియు చేపల విక్రయదారులకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని సీఎస్‌సీ వీఎల్ఈ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేముల అనిల్ కుమార్ తెలిపారు. మల్కాపూర్‌లోని సీఎస్‌సీ సెంటర్‌లో మత్స్యకారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు, ఆక్వా రైతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి మత్స్య కిసాన్ సమృద్ధి సహ-యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు, బీమా, సబ్సిడీలు, శిక్షణ వంటి ప్రయోజనాలు అందించడమే లక్ష్యమని చెప్పారు. ఎన్ఎఫ్‌డీపీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా చేపల క్రయవిక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, ఈ-వేలం, మార్కెటింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దీని ద్వారా చేపల వేట మరియు విక్రయాలపై ఆధారపడిన ముదిరాజులు, బెస్తలు మరియు ఇతర మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి, తమ వ్యాపారాన్ని విస్తరించడానికి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు సమీపంలోని సీఎస్‌సీ సెంటర్లలో తమ పేర్లు నమోదు చేసుకుని ధ్రువీకరణ పత్రాలు పొందాలని సూచించారు. మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం



కరీంనగర్, మార్చి 16: తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల సాహితీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మెదక్ జిల్లాకు చెందిన నందిని సిధారెడ్డి ప్రముఖ కవి, రచయిత, సామాజిక ఉద్యమకారుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. తెలంగాణ అస్తిత్వం, పల్లె జీవితం, ఉద్యమ ఆవేశాన్ని తన కవిత్వం, పాటల ద్వారా ప్రతిబింబింపజేశారు. ఆయన రచించిన 'అనిమేష' కవితా సంపుటికి 2025 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. 'అనిమేష' కవితా సంపుటిలో కరోనా కాలంలో ప్రపంచం ఎదుర్కొన్న సామాజిక పరిస్థితులు, మానవ సంబంధాలు, వలస కూలీల కష్టాలు, ఒంటరితనం వంటి అంశాలను హృద్యంగా ప్రతిబింబించారు. ఈ కవిత్వం ద్వారా సమాజంలోని మార్పులను, మానవ విలువలను సున్నితంగా ఆవిష్కరించారు. నందిని సిధారెడ్డి 1955 జూన్ 12న జన్మించారు. అధ్యాపకుడిగా పనిచేసిన ఆయన తెలంగాణ సాహితీ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఏర్పాటైన తెలంగాణ సాహిత్య అకాడమీకి తొలి చైర్మన్‌గా (2017--2020) సేవలందించారు. ఆయన రచించిన భూమిస్వప్నం, సంభాషణ, దివిటీ, ప్రాణహిత, ఒక బాధ కాదు, నది పుట్టుబడి, ఇగురం, ఆవర్తనం, నాగేటి చాల్లల్ల (పాటలు), ఇక్కడి చెట్లగాలి, చిత్రకన్ను, అనిమేష వంటి రచనలు విశేష గుర్తింపు పొందాయి. 'నాగేటి సాల్లల్ల నా తెలంగాణ' వంటి పాటల ద్వారా తెలంగాణ పల్లె జీవనాన్ని, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లారు. భూమిస్వప్నం, ప్రాణహిత వంటి కవితా సంపుటాలకు అనేక పురస్కారాలు లభించాయి. 2010లో ఉత్తమ గేయ రచయితగా నంది పురస్కారం, 2016లో తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడం తెలంగాణ సాహిత్యానికి గౌరవంగా భావిస్తూ సమైక్య సాహితీ ప్రతినిధులు మాడిశెట్టి గోపాల్, అనంతాచార్య, డా. బివిఎన్ స్వామి తదితరులు నందిని సిధారెడ్డికి అభినందనలు తెలిపారు.

# జాతీయ రహదారి-563 పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్, మార్చి 16: కరీంనగర్ జిల్లా మీదుగా వెళు_న్న జాతీయ రహదారి--563 నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం భారత జాతీయ రహదారి సంస్థ వరంగల్ ప్రాజెక్ట్ సంచాలకుడు భరద్వాజ్, రెవెన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్ తదితర అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్ మాట్లాడుతూ వరంగల్ నుంచి కరీంనగర్ వరకు రహదారి నిర్మాణ పనులు ఇప్పటికే 89 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ ఏడాది జూలై 31 నాటికి పనులను పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భారత జాతీయ రహదారి సంస్థ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో భూసేకరణ తదితర సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. దాదాపు 90 శాతం పనులు పూర్తైన నేపథ్యంలో మిగిలిన పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచనలు చేశారు.




### కొత్తపల్లి-హుస్నాబాద్ రహదారి పనులపై సమీక్ష

కొత్తపల్లి--చిగురుమామిడి, చిగురుమామిడి--హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనుల పురోగతిపై రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. భూసేకరణ, విద్యుత్ స్తంభాల తొలగింపు, పునర్నిర్మాణం తదితర అంశాలపై రెవెన్యూ, పంచాయతీ, రోడ్లు భవనాల శాఖ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచిస్తూ ఈ పనులపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ ఈఈ నరసింహచారి, డీఈ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కాల్వల ప్రాజెక్ట్ మత్తడి మరమ్మత్తులకు జాగృతి ధర్నా

కరీంనగర్, మార్చి 16: కాల్వల ప్రాజెక్ట్ మత్తడికి వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎల్ఎండి కాలనీలోని ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం కరీంనగర్‌లో జాగృతి జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో ఉన్న పలు ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పోరాటాలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని శంకరపట్నం, వీణవంక మండలాల రైతులకు ఉపయోగపడే కాల్వల ప్రాజెక్ట్ మత్తడి మూడు సంవత్సరాల క్రితం కొట్టుకుపోయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం మరమ్మత్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రెండు మండలాల పరిధిలోని 15 నుంచి 20 గ్రామాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని, స్థానిక రైతులు ఎక్కువగా ఈ ప్రాజెక్ట్ నీటిపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని తెలిపారు. మత్తడి కొట్టుకుపోయినప్పటి నుంచి ప్రజా



ప్రతినిధులు సమస్యను పట్టించుకోలేదని అన్నారు. గత సంవత్సరం జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా కవిత స్వయంగా కాల్వల ప్రాజెక్ట్ పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకు మ-రమ్మత్తులు చేపట్టలేదని విమర్శించారు. అందువల్ల రైతులను కలుపుకొని మంగళవారం ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా మహిళ అధ్యక్షురాలు అక్కం శివరాణి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు బుడిగె పర్శారం గౌడ్, రంగరవేణి లక్ష్మణ్, బసవేణి రాజేందర్, గర్శకుర్తి విద్యాసాగర్, గాడిచర్ల కొమరయ్య, మహిళ నాయకురాలు జంగ అపర్ణ, ఎండీ సల్మా, బశెట్టి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## 6 గ్యారంటీలు అమలు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం: బొంతల కళ్యాణ్ చంద్ర

కరీంనగర్, మార్చి 16: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేక ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు బొంతల కళ్యాణ్ చంద్ర విమర్శించారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం తిమ్మాపూర్ మండల బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేకపోయిందని అన్నారు. అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిస్తోందని విమర్శించారు. మహాలక్ష్మి పథకంలో మహిళలకు ప్రతి నెల రూ.2500, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి హామీలు అమలు కాలేదని అన్నారు. రైతు భరోసా పథకంలో కూడా రైతులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందడం లేదని, రైతాంగాన్ని ప్రభుత్వం నిరాశపరిచిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో రైతులకు రూ.15 వేల రైతు భరోసా అందిస్తామని ప్రకటించి తర్వాత రూ.12 వేలకు కుదించడం రైతులను మోసం చేసినట్లేనని అన్నారు. యువ వికాస పథకం, విద్యా భరోసా కార్డు, ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు



వంటి హామీలు కూడా అమలు కాలేదని విమర్శించారు. పెన్షన్లను రూ.4 వేల వరకు పెంచుతామని చెప్పినా ఆ హామీ నెరవేర్చలేదని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇల్లు స్థలం ఉన్న వారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలాలు వంటి హామీలు కూడా అమలు కాలేదన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. ఆరు గ్యారంటీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని, వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల అమలుకు బీజేపీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చింతం శ్రీనివాస్, బూట్ల శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, ఎర్రోజు లక్ష్మణ్, పాశం రాఘవరెడ్డి, బోనాల మోహన్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు దురిశెట్టి రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఎలుకపెల్లి స్వామి, మండల జనరల్ సెక్రటరీ గొట్టుముక్కల తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు వేల్పుల ఓదెలు, పబ్బ తిరుపతి, సత్తయ్య కుమార్, హరికృష్ణ, కెమెరా వెంకటేష్, అజయ్, ఈశ్వరాచారి, జాడి రాజు, రాఘవరెడ్డి, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీల హామీలపై మండల బిజెపి మండిపాటు

జనత న్యూస్ బెజ్జంకి : మండల బిజెపి పార్టీ అధ్యక్షులు కొలిపాక రాజు నేతృత్వంలో ముఖ్య అతిథులు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి మరియు కిషన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డిల సౌజన్యంలో సోమవారం మండల బిజెపి శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై మండిపడుతూ స్థానిక తహసీల్దార్ కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి శ్రేణులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలను 6 గ్యారంటీల హామీతో మోసం చేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన, సంపూర్ణంగా అమలు చేయలేదని, ప్రజలతోపాటు, రైతులను, మహిళలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలను అమలుపరిచి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ బుర్ర మల్లేశం గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బోయినిపెల్లి అనిల్ రావు,



మండల నాయకులు దొమ్మాటి రాములు, కొత్తపేట రామచంద్రం, గైని రాజు గౌడ్, జెల్ల అనిల్, లోనే నర్సింగారావు, బండిపెల్లి శ్రీను, బుర్ర కిషన్ గౌడ్, పులి శ్రీకాంత్ గౌడ్, కందిరాజు, ఎలుక శ్రీశైలం పాల్గొన్నారు.

# ఎంజెపి గురుకులాన్ని టాప్‌లో ఉంచండి

**అత్యుత్తమ విద్య బోధనకు కేరాఫ్‌గా తీర్చిదిద్దండి**
**విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలి..**
**వారికి ఇబ్బంది రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలి**
**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..**
**తిమ్మాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ**
**వసతుల కల్పన పై ఆరా..**
**అధికారులకు దిశా నిర్దేశం.**




తిమ్మాపూర్, జనతా న్యూస్ అత్యుత్తమ విద్యా బోధనకు కేరాఫ్ అడ్రస్ గా మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాన్ని తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులకు సూచించారు. అత్యుత్తమ విద్యను బోధించాలని మంచి ఫలితాలు సాధించి గురుకులాన్ని టాప్ లో నిలబెట్టాలని పేర్కొన్నారు. తిమ్మాపూర్ లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. మెనూ ప్రకారం టిఫిన్ లంచ్ పెడుతున్నారా.. విద్యాబోధన ఎలా ఉంది.. వసతులు సౌకర్యాలు అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని బాగున్నాయని విద్యార్థులకు సమాధానం ఇచ్చారు. అనంతరం స్టాఫ్ రూము, వాష్రూమ్స్ వంటగది స్టోర్ రూమ్ డార్మెటరీ గదులను పరిశీలించారు. స్టోర్ రూమ్ లో బియ్యము పప్పులు ఇతర సామాగ్రిని పర్యవేక్షించారు. సామాగ్రికి సంబంధించిన ఎక్స్పైరీ డేట్ ను తరచు చూడాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అత్యుత్తమ విద్యను బోధించాలని మంచి ఫలితాలు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా గురుకులంలో చేపట్టిన మోడ్రన్ కిచెన్ ఆధునికరణ పరులను పరిశీలించారు. గురుకులంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాలని వసతుల కల్పన.. మెనూ ప్రకారం భోజనం కల్పించే విషయంలో

అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. తాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ జరపాలని సూచించారు. గురుకులంలో ఏమైనా పెండింగ్ పనులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. శానిటేషన్ సమస్త తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. గురుకులంలో కోతుల బెడద ఉందని వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ జిల్లా కలెక్టర్ ను కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ కోతుల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గురుకులం అభివృద్ధి.. విద్యా బోధన.. ఇతర అంశాలపై అంశాలపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, స్థానిక గురుకుల ప్రిన్సిపాల్ సరిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో సూపరింటెండెంట్

**కార్యాలయం నుండి అదుపులోకి**
**అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు**




తిమ్మాపూర్, జనతా న్యూస్ : జాయింట్ డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్ కార్యాలయంలో సూపరింటెండెంట్ గా పని చేస్తున్న ఈగల మధుసూధన్ ని కరీంనగర్ ఏసీబీ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. ఏసీబీ అధికారులు, జేడీ డబ్ల్యూ ఏ ఆఫీసు ఉద్యోగులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్ఎండీ కాలనీలోని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసులో సూపరింటెండెంట్ గా పని చేస్తున్న ఈగల మధుసూధన్ పై గతంలో ఫిర్యాదులు అందడంతో విచారణ జరిపినట్లు ఏసీబీ డీస్పీ విజయ్ కుమార్ తెలిపారు. ఏసీబీ అధికారులు సోమవారం మధ్యాహ్నం కార్యాలయంకు చేరుకుని జేడీకి సమాచారం అందించి మధుసూధన్ ని అదుపులోకి తీసుకుని కరీంనగర్ ఏసీబీ కార్యాలయానికి తరలించారు. మధుసూధన్ 2022 నుండి 2023 వరకు భద్రాద్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో తన స్నేహితుని పేరున బినామీ అకౌంట్ తీసి అందులో ఉద్యోగులు, కాంట్రాక్టర్ల నుండి వసూలు చేసిన అక్రమ సొమ్మును జమచేయించాడు. అనంతరం ఇద్దరి మధ్యన నెలకొన్నగొడవలు ఫిర్యాదుల వరకు వెళ్లాయి. బ్యాంకు లావాదేవీలపై విచారణ జరిపిన ఏసీబీ అధికారులు రూ.12.77లక్షలను గుర్తించి మధుసూధన్ ని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి సోమవారం సాయంత్రం కరీంనగర్ లోని ఏసీబీ కోర్టులో హాజరుపరచినట్లు ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు. పలు కారణాల కారణంగా ఫిర్యాదుదారుని పేరును గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిపారు.ఎవరైనా అవినీతికి పాల్పడితే 1064 నంబర్ కి, కరీంనగర్ లోని ఏసీబీ కార్యాలయంలో సైతం ఫిర్యాదు చేయవచ్చని డీఎస్పీ తెలిపారు.

## అంగన్వాడీలకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలుపరచాలి

**సిపిఎం బెజ్జంకి గ్రామ కార్యదర్శి బొమ్మిడి సాయికృష్ణ.**




జనత న్యూస్ బెజ్జంకి : ఇచ్చిన హామీలపై శాంతియుత నిరసనకు బయలుదేరుతున్న అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలను సిపిఎం నాయకులను పోలీసులు అరెస్టు చేయడం సరైంది కాదని సిపిఎం మండల కార్యదర్శి బొమ్మిడి సాయికృష్ణ స్థానిక పోలీస్ స్టేషన్ నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో అంగన్వాడీలకు ఇచ్చిన 18 వేతన హామీని ప్రభుత్వం అమలుపరచాలని, ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడి కేంద్రాలకు మార్చి 16 నుండి ఒంటిపూట బడి నిర్ణయించాలని, ఐసిడిఎస్ కు సరిపడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## మున్సిపల్ అంగడి టెండర్లలో సిండికేట్లను అరికట్టాలి

**బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి**



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ మున్సిపల్ అంగడి టెండర్ల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, మున్సిపాలిటీకి వచ్చే ఆదాయానికి గండికొట్టేలా సిండికేట్లుగా ఏర్పడితే ఊరుకోబోమని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు.సోమవారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ఏడాది టెండర్ దారులు సిండికేట్‌గా ఏర్పడి మున్సిపాలిటీకి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా, అధికారులతో కుమ్మక్కై రైతులకు, చిరు వ్యాపారులకు ఆర్థిక భారము కలిగించేలా ధరలు పెంచారని ఆరోపించారు. మున్సిపల్ నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని గతంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని మండిపడ్డారు.రాబోయే 2026-27 సంవత్సరానికి నిర్వహించే అంగడి వేలంలో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఆదాయం తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. అంగడికి వచ్చే పశువుల వ్యాపారులు, చిరు వ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని గుర్తుచేశారు. ఒకవేళ టెండర్ దారులు మళ్లీ సిండికేట్‌గా ఏర్పడి అక్రమాలకు పాల్పడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బొజ్జ హరీష్, కందుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ అంగడిలో పశువుల అక్రమ రవాణా

**నిబంధనలకు విరుద్ధంగా వధశాలలకు తరలింపు.. జిల్లా కలెక్టర్‌కు వినతి**




హుస్నాబాద్, జనత న్యూస్: హుస్నాబాద్ పట్టణంలోని పశువుల అంగడిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పశువుల తరలింపుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బీజేపీ నాయకులు కె. వేణుగోపాల్ రెడ్డి తదితరులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రతి ఏటా టెండర్ ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించే ఈ అంగడిలో, ప్రస్తుతం పశువైద్యాధికారుల అనుమతి లేకుండానే పెద్ద ఎత్తున పశువులను వధశాలలకు తరలిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పాడిపశువులకు నిలయంగా ఉన్న హుస్నాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, కటిక వ్యాపారులు నిబంధనలను తుంగలో తొక్కి ఆరోగ్యకరమైన ఆవులు, గేదెలు, దూడలను అక్రమంగా ఎగుమతి చేస్తున్నారని ఆరోపించారు.వ్యాపారులు రైతుల కంటే అధిక ధర చెల్లించి మరీ పాడి పశువులను కొనుగోలు చేస్తుండటంతో, వ్యవసాయ పనుల కోసం ఎడ్లను లేదా పాడి కోసం గేదెలను కొనాలనుకునే సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. ఈ నెల 18న హుస్నాబాద్ అంగడిలో వేలం పాట నిర్వహించనున్న నేపథ్యంలో, మున్సిపల్ కమిషనర్ నిబంధనలను కఠినతరం చేసేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ప్రతి వారం అంగడిలో జరిగే పశువుల రవాణాకు పశువైద్యాధికారి అనుమతిని తప్పనిసరి చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మహిళా భవనాలకు స్థలం ఇవ్వండి

**బెజ్జంకి సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న**



జనత న్యూస్ బెజ్జంకి : రాష్ట్ర ప్రభుత్వం బెజ్జంకి మండల కేంద్రానికి ఆరు మహిళా సంఘ భవనాలను కేటాయించడంతో స్థానిక సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న పాలకవర్గంతో పాటు, మహిళలతో కలిసి వాటి నిర్మాణానికి అవసరమైన స్థలాలను కేటాయించాలని తహసిల్దార్ కు సోమవారం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ధూమాల మహేష్, కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, వార్డు సభ్యులు బోనగం రమేష్ గౌడ్, తిప్పారం మహేష్, ఐలేని విజయ నరసింహారెడ్డి, వివో ఏ లు నీరజ, విజయలక్ష్మి, లత తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్యలో సినిమా షూటింగ్ సందడి

**కాలేజీ కుర్రోళ్ల సినిమాలో నూతన హీరోలు, హీరోయిన్**
**నటులు సుమన్, ముమైత్ ఖాన్ తో షూటింగ్**



తిమ్మాపూర్, జనతా న్యూస్ : శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో సినిమా షూటింగ్ కొనసాగుతుంది. ఐదు రోజులుగా కొనసాగుతున్న సినిమా షూటింగ్ లో నటీనటులతో సందడి నెలకొంది. బ్లూజైన్ బ్యానర్ పై కాలేజీ కుర్రోళ్లు పేరుతో కొనసాగుతున్న సినిమా షూటింగ్ కి కోనేటి శ్రీనివాస్ దర్శకునిగా వ్యవహరిస్తుండగా నూతి చందు, ఆచంట గోపినాథ్ నిర్మాతలుగా ఉన్నారు. సినిమాలో నటుడు సుమన్ ప్రిన్సిపాల్ గా, ముమైత్ ఖాన్, జెమినీ సురేష్, జబర్దస్త్ గడ్డం నవీన్, నివాస్, యాదగిరి లెక్చరర్లుగా, కమెడియన్ లక్ష్మన్ అటెండర్ గా నటిస్తున్నారు. పన్నెండు రోజుల పాటు జరిగే సినిమా షూటింగ్ లో హీరోలుగా సిద్దార్థ, రవి, హీరోయిన్ గా నిత్య, కెమెరా మెన్ గా శ్యాం కే నాయుడు, ధృవ మ్యూజిక్ డైరెక్టర్ గా చిత్ర నిర్మాణంలో క్రీయాశీలకంగా వ్యవహరిస్తున్నారు. శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలోని ఆడిటోరియంలో సోమవారం రాత్రి షూటింగ్ కొనసాగింది. కళాశాలలోని వివిధ ప్రాంతాలలో సైతం షూటింగ్ జరిగింది. కాగా షూటింగ్ కి సహకరిస్తున్న కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డికి, ప్రిన్సిపాళ్లకు, లెక్చరర్లు, సిబ్బందికి సినిమా షూటింగ్ బృంధం కృతజ్ఞతలు తెలిపారు.

## వంటగ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఐ ధర్నా



చిగురుమామిడి,జనత న్యూస్: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న బాంబు దాడులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఖండించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందే స్వామి, మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో పెరిగిన గ్యాస్ ధరలకు నిరసనగా ఖాళీ సిలిండర్లతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పశ్చిమాసియా యుద్ధ ప్రభావం సామాన్యుడిపై పడుతోందని, యుద్ధం సాకుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తులు, వంటగ్యాస్ ధరలను అడ్డగోలుగా పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తోందని మండిపడ్డారు.అంతర్జాతీయ పరిణామాలను అంచనా వేయడంలో కేంద్రం విఫలమైందని, ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో మౌనం వీడాలని వారు కోరారు.మరోవైపు రాష్ట్రంలో గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, గ్యాస్ గోదాముల వద్ద ప్రజలు క్యూ కట్టడం విడ్డూరంగా ఉందన్నారు. గ్యాస్ దొరక్క హోటళ్లు, హాస్టల్ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కృత్రిమ కొరతను నివారించి పాత ధరలకే సిలిండర్లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోగా, ఎస్సై పృథ్వీధర్ గౌడ్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి నిరసనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి, మాజీ సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్ రెడ్డి, ముద్రకోల రాజయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గూడెం లక్ష్మి, అందే చిన్నస్వామి, మావురపు రాజు, గందె కొమురయ్య, ఉస్మాన్ పాషా, అనవోజు జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణీ దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరిస్తాం: మేయర్, కమిషనర్



కరీంనగర్: నగరపాలక సంస్థ ప్రజావాణీ కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. సోమవారం కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మేయర్, కమిషనర్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తం 24 దరఖాస్తులు అందాయి. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించినవి 3, టౌన్ ప్లానింగ్ 12, ఇందిరమ్మ 1, సానిటేషన్ 2, రెవెన్యూ విభాగానికి 6 దరఖాస్తులు ఉన్నాయి. దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులకు మేయర్, కమిషనర్ సూచనలు చేశారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్‌ఆర్‌ఆర్ కోసం భూమి కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: కలెక్టర్ హైమావతి



సిద్దిపేట, మార్చి 16: రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి సూచించారు. సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాయంలోని మీటింగ్ హాల్‌లో రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణం వల్ల భూమి కోల్పోతున్న జగదేవ్‌పూర్ మండలం చెబర్తి, అల్రాజీపేట, పిర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల రైతులతో ఆర్బిట్రేషన్ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్ వెళ్తున్న నేపథ్యంలో ప్రాంత అభివృద్ధి కోసం రైతులు భూమి ఇవ్వడానికి ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న రైతులకు ప్రభుత్వ తరఫున అందాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోదయోగ్యమైన పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. భూ సేకరణ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహసిల్దార్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో మెనూ అమలు, పరిశుభ్రతపై నిర్లక్ష్యం సహించం: కలెక్టర్ హైమావతి



సిద్దిపేట, మార్చి 16: గురుకుల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లలో మెనూ అమలు మరియు పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి హెచ్చరించారు.సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమానికి ముందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గురుకులాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేస్తున్నప్పుడు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం, తగిన పరిమాణంలో విద్యార్థులకు అందించడం లేదని, వంటగదులు, స్టోర్ రూమ్‌లలో పరిశుభ్రత పాటించకపోవడం గమనిస్తున్నామని అన్నారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో మండల స్థాయి అధికారులు ప్రతిరోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం సమయాల్లో పర్యటిస్తూ విద్యార్థులకు సరైన ఆహారం అందేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బీసీ బాలికల హాస్టల్, ఎస్సీ వెల్ఫేర్ పోస్ట్ మెట్రిక్ బాలికల హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు వంటగదులు, స్టోర్ రూమ్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయని తెలిపారు. పోస్ట్ మెట్రిక్ బీసీ బాలికల హాస్టల్‌లో అపరిశుభ్రతపై ప్రశ్నించగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంక్షేమ అధికారిని సస్పెండ్ చేయాలని, వాచ్‌మెన్ మరియు వంట మనిషిని విధుల నుంచి తొలగించాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారిని ఆదేశించారు. అదేవిధంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రతిరోజు కార్యక్రమాల వివరాలను ఫోటోలతో సహా ఆన్లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, గ్యాస్ కృత్రిమ కొరత రాకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ నెల 22న నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ, జిల్లా కేంద్రంలో జిల్లా జైలు ప్రారంభోత్సవానికి అధికారులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి స్వచ్ఛతపై అధికారులు డెమో నిర్వహించారు. ఆర్‌ఓ నీరు, బోర్ నీటితో పోల్చితే మిషన్ భగీరథ నీరు ఎలా శుద్ధంగా ఉంటుందో వివరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అబ్దుల్ హమీద్, డీఆర్‌ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నివాళులు



కరీంనగర్: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం పోరాడిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలను స్మరించుకోవాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని టవర్ సర్కిల్ సమీపంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. జయంతి సందర్భంగా పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ బోధించిన అహింస, సత్యం, హరిజనోద్ధరణ ఆశయాల కోసం పొట్టి శ్రీరాములు జీవితాంతం కృషి చేశారని తెలిపారు. మద్రాస్ రాష్ట్రం నుండి తెలుగు మాట్లాడే ప్రాంతాలను విడదీసి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన చేపట్టిన నిరాహార దీక్షతో అమరుడైన మహనీయుడని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి తెలుగు ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండ రమణారెడ్డి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏబీసీ సెంటర్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్: ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 5వ డివిజన్‌లోని బొమ్మకల్ ప్రాంతాన్ని మేయర్ అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ నూతనంగా నిర్మాణంలో ఉన్న ఏబీసీ సెంటర్ పనులను పరిశీలించి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏబీసీ సెంటర్‌లో కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, బర్త్ కంట్రోల్ శస్త్రచికిత్సలకు అవసరమైన ఏర్పాట్లపై వివరాలు తెలుసుకుని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఏబీసీ సెంటర్‌లో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పిస్తూ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని అన్నారు. ప్రస్తుతం కుక్కల కోసం ఏర్పాటు చేసిన 38 కెనల్స్‌ను 100కు పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి మరో 62 కెనల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మేకల వెంకటేష్, బండ రమణారెడ్డి, వెటర్నరీ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, ఎంహెచ్‌ఓ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ పరిశ్రమ ప్రారంభానికి విస్తృత ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ హైమావతి



సిద్దిపేట, మార్చి 16: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో ఏర్పాటు చేసిన టీజీ ఆయిల్ ఫెడ్ ఆయిల్ ఫామ్ పరిశ్రమను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 22న ప్రారంభించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం ఆయిల్ ఫామ్ పరిశ్రమలోని సమావేశ మందిరంలో కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా పరిశ్రమ వద్దకు చేరుకుంటారని, అదే రోజు జిల్లా జైలు భవనాన్ని కూడా ప్రారంభించనున్నారని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక తదితర శాఖల ఆధ్వర్యంలో మార్చి 20, 21, 22 తేదీల్లో ఫ్యాక్టరీ ప్రాంగణంలో 120 స్టాళ్లతో రైతు మహోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. రోజుకు మూడు వేల నుంచి ఐదు వేల మంది రైతులు పాల్గొనే అవకాశం ఉన్నందున తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. శానిటేషన్ సిబ్బందిని నియమించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని డీపీఓకు సూచించారు. వైద్యశాఖ ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. హెలిప్యాడ్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో చేయాలని పేర్కొన్నారు. పరిశ్రమ ప్రారంభోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నందున దాదాపు 600 బస్సుల ద్వారా సుమారు 30 వేల మంది పాల్గొనే అవకాశం ఉందని, వారికి తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుని సమగ్ర ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ కార్యక్రమానికి వచ్చే ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. భద్రతా దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, విధుల్లో ఉన్న సిబ్బంది పోలీస్ శాఖ జారీ చేసే గుర్తింపు కార్డులు ధరించాలని సూచించారు. మీడియా ప్రతినిధుల కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.పార్కింగ్ ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల దృష్ట్యా అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని, అగ్నిప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హెలిప్యాడ్, సభాస్థలి, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు డీసీపీలు కుశాల్కర్, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, పంచాయతీ, మిషన్ భగీరథ, ఆర్ అండ్ బి, సమాచార పౌర సంబంధాల శాఖ, ఆయిల్ ఫెడ్, ఫైర్ సేఫ్టీ, విద్యుత్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com